క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతికి ఘన ఏర్పాట్లు

ఎర్రగుంట్ల : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించడానికి ఘనంగా ఏర్పాట్లు చేశామని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. అక్కడి నుంచి ఎర్రగుంట్ల మార్కెట్ యార్డులోని మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. కావున వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

గంగమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నరేన్‌రామాంజనేయరెడ్డి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గంగమ్మ దేవస్థానంలో కమలాపురం వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజనేయరెడ్డి సోమవారం గంగమ్మతల్లిని దర్శించుకొని, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, పూజలు చేశారు. నరేన్‌రెడ్డి వెంట జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, కమలాపురం జెడ్పీటీసీ రాజశేఖరరెడ్డి, చింతకొమ్మదిన్నె మండల ఉపాధ్యక్షుడు సుధాకరరెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకరరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు గుత్తిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శ్రీరామిరెడ్డి, సురేంద్ర, ఓబుళరెడ్డి, సదానంద, కువైట్ బాషా, నీలకంఠ, శ్రీనివాసులు, జయరాం, చిన్నసుబ్బారాయుడు, దొండపాటి సుబ్బారెడ్డి, బొమ్మేపల్లె రెడ్డెన్న, కృష్ణయ్య, వెంకటరెడ్డి, జగన్‌మోహనరెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ముద్దనూరు : ముద్దనూరు–కడప రహదారిలో ఓ డాబా వద్ద సోమవారం గణపత్ దావర్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. నిందితుడు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నర్వాలి గ్రామానికి చెందిన గణపత్ అని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ

కమలాపురం : కమలాపురం పట్టణ పరిధిలోని అక్కంపేట గ్రామానికి చెందిన పాణ్యం నాగేంద్ర, గాలింకి రామచంద్రల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అక్కంపేట ఎస్సీ కాలనీలో నాగేంద్ర స్థలానికి ఆనుకుని రామచంద్రకు స్థలం ఉంది. ఈ స్థలం గురించి ఇద్దరి మధ్య గతంలోనే మనస్పర్థలున్నాయి. సోమవారం రామచంద్ర తన స్థలంతో పాటు నాగేంద్ర స్థలంలో కూడా కంప కట్టెలు వేయడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తమ స్థలంలో కట్టెలు ఎందుకు వేశావని నాగేంద్ర ప్రశ్నించడంతో ఈ స్థలం కూడా మాదేనని రామచంద్ర చెప్పడంతో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. వాగ్వాదానికి దిగడంతో పాటు కట్టెలతో కొట్టుకున్నారు. ఈ ఘటనలో నాగేంద్ర చేతులకు, రామచంద్ర తలకు రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్ఆర్ హయాంలో పులివెందులకు మహర్దశ

- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి
- పలు సేవా కార్యక్రమాలు
- నేడు వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ కుటుంబీకుల నివాళి



పులివెందులలోని ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాల



పులివెందుల జేఎన్‌టీయూ కళాశాల

పులివెందుల : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పులివెందులకు మహర్దశ లభించింది. పులివెందుల పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలు సైతం అన్నివిధాలుగా అభివృద్ధికి నోచుకున్నాయి. నియోజకవర్గంలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలన్న లక్ష్యంతో విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు వైఎస్ఆర్ ప్రత్యేక చొరవ చూపారు. అందులో భాగంగా జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, ఫుడ్అండ్‌సైన్స్ టెక్నాలజీ కళాశాల, ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీ లాంటి కళాశాలలను ఏర్పాటు చేశారు. దీంతోపాటు ప్రతి మండలంలో ఇంటర్, ఐటీఐ పాల్‌టెక్నికల్ కళాశాలలను స్థాపించారు. అదే విధంగా మండలస్థాయిలో గురుకుల, కస్తూర్బా లాంటి కళాశాలలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేశారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రత్యేక చొరవ

వైఎస్ఆర్ నియోజకవర్గంలో పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపారు. పీఎంఈవై, పశుక్రాంతి కింద విరివిగా పాడి పశువులను రాయితీతో ఇవ్వడంతో జిల్లాలోనే పులివెందులలో అత్యధికంగా పాల సేకరణ జరిగింది. అదే విధంగా పాడి పశువులకు వచ్చే జబ్బుల నివారణకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నెలకొల్పారు. ఈ ఆసుపత్రిలో పాడి పశువులలో వచ్చే ప్రాణాంతక జబ్బులను నివారించేందుకు అందుబాటులోకి అధునాతన వైద్య చికిత్సలు తెచ్చారు. అదే విధంగా 654 ఎకరాలలో రూ.350 కోట్లతో ఆంధ్రప్రదేశ్ అత్యున్నతస్థాయి పశుపరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో పరిశోధనలు జరగాలని మహానేత ఆకాంక్షించారు. అయితే ఈ కార్యక్రమం నేటికీ మొదలు కాలేదు. ఆయన మరణానంతరం నిధుల కొరత కారణంగా ఐజీ కార్ల్‌లో పరిశోధనలకు మంగళం పాడారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

వైఎస్ఆర్ హయాంలో పులివెందుల నియోజకవర్గానికి నిధులు వరదలా ప్రవహించడంతో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. పులివెందుల మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్‌గా చేయడం.. పులివెందుల చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడం.. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పనకు న్యాక్ ఏర్పాటుతోపాటు గోవింద రాజా, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌లను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు. అదేవిధంగా రైతాంగానికి సంబంధించి గండికోట, పైడిపాలెం ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. అదే విధంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఆధునీకీకరణ(కాలువలకు లైనింగ్) ఏర్పాటు, సూక్ష్మ నీటి కేంద్రం కింద సింహాద్రిపురం మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయడం జరిగింది. పైడిపాలెం నుంచి చిత్రావతి, హిమకుంట్ల, తొండూరు చెరువులకు నీరు అందించడానికి పనులను ప్రారంభించారు. హిమకుంట్ల చెరువును పీబీసీ కాలువలోకి లిఫ్ట్ ద్వారా ఆయకట్టుకు నీరు అందించేలా పనులు చేపట్టారు. ఆ ఫలాలు ప్రజలకు అందడంతో అభివృద్ధి బాట పట్టారు.

నేడు వైఎస్ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు

మంగళవారం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డి పులివెందులకు చేరుకున్నారు. వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఇడుపులపాయకు చేరుకున్నారు. మంగళవారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వైఎస్ కుటుంబ సభ్యులు నివాళులర్పించడంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం 6.30 గంటలకు స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, కుల సంఘాలు, అనుబంధ సంఘాల వారు, పులివెందుల ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కడప గడపలో కృష్ణమ్మ సవ్వడులు!

- సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోసిన దివంగత సీఎం వైఎస్సార్
- మెట్ట ప్రాంతాల్లో కృష్ణా జలాలు పారిస్తే నా జన్మ ధన్యమని నాడే స్పష్టీకరణ
- ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన టీడీపీ ప్రభుత్వం
- అంబకపల్లె చెరువుకు చేరిన కృష్ణమ్మ



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జలహారతులు ఇవ్వనున్న అంబకపల్లె గంగమ్మ కుంట చెరువు

సాక్షి ప్రతినిధి కడప : 'బిర బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను...బంగారు పంటలే పండుతాయి. ముత్యాల మురిపాలు దొరలుతాయి'.. ఇది శంకరంబాడి సుందరాచార్యులు రాసిన గేయం. ఇది ఒకనాటికి నిజమవుతుందని జిల్లా ప్రజలెవరూ ఊహించలేదు. మెట్ట ప్రాంతంలో కృష్ణా జలాలు పారిస్తే నా జన్మ ధన్యమని రాజోలి రిజర్వాయర్ శంకుస్థాపన సందర్భంగా ఆనాడే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్పష్టంగా చెప్పారు. ఆ మహానేత నిర్వహించ తలపెట్టిన జలయజ్ఞం ఫలితం సాకారమైంది. నీళ్లలేక నోళ్లు తెరచిన పులివెందుల నియోజకవర్గ బీడు భూములు పులకిస్తున్నాయి.

'తండ్రి బావి తవ్విస్తే కుమారుడు పూడ్చేశాడన్నట్లుగా' రాయలసీమ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 1988లో గాలేరు–నగరి, ఆ తర్వాత హంద్రీ–నీవా, వెలిగొండ ప్రాజెక్టులను ప్రకటించి శంకుస్థాపన చేశారని నాటి రాయలసీమ ఉద్యమకారులు వివరిస్తున్నారు. ఆ తర్వాత అనూహ్యంగా అధికారిక పగ్గాలు చేజిక్కించుకున్న చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఓ మాట.. తర్వాత మరోమాట చెబుతూ ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ఆ విషయాన్ని చరిత్ర స్పష్టం చేస్తోంది. 1996 పార్లమెంటు ఎన్నికల ముందు ఓట్ల కోసం గండికోట ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆపై నిర్మాణాన్ని విస్మరించారు. మళ్లీ ఎన్నికల్లో ప్రజలకు చెప్పుకోవాలి కనుక 1999 సాధారణ ఎన్నికలకు ముందుగా 1998లో వామికొండ వద్ద మరోమారు శంకుస్థాపన చేశారు. గద్దెనెక్కిన తర్వాత మళ్లీ విస్మరించారు. కృష్ణ స్వామి కమిటీ వేసి జీఎన్ఎస్ఎస్‌కు గండికొట్టే ప్రయత్నాలు చేశారని విశ్లేషకులు వివరిస్తున్నారు. తన తొమ్మిదేళ్ల పాలనలో ఈ ప్రాజెక్టుకు ఆయన ఖర్చు చేసింది కేవలం రూ.67.50 కోట్లు మాత్రమే. అది కూడా సిబ్బంది జీతభత్యాలకు మాత్రమే. ప్రాజెక్టు పనులు ఒక్క అడుగు ముందుకు సాగలేదు. అధికారిక గణాంకాల ద్వారా ఈ విషయం తేటతెల్లమవుతోంది. పైగా రాయలసీమ సాగు, తాగునీరు అందాలంటే శ్రీశైలం ప్రాజెక్టులో 854 అడుగుల కనీస నీటిమట్టాన్ని ఉంచాలి. కాగా చంద్రబాబు సర్కార్ జీఓ నెంబర్ 69 జారీ చేసి శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటిమట్టం 834 అడుగులకు కుదించడం ద్వారా రాయలసీమ మరణశాసనాన్ని లిఖించారని పలువురు విమర్శిస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోసిన వైఎస్..

2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కేవలం ఐదేళ్ల కాలంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం జిల్లాలో దాదాపు రూ.12వేల కోట్లు వెచ్చించారు. మొదటి దశలో భాగమైన అవుకు నుంచి గండికోటకు వరదకాలువ, గండికోట రిజర్వాయర్, టన్నెల్, వామికొండ, సర్వరాయసాగర్ పనులు సుమారు 85 శాతం పూర్తి చేశారు. అవుకు రిజర్వాయర్ కాంప్లెక్స్ సామర్థ్యాన్ని 4.8 టీఎంసీలకు పెంపు, గోరకల్లు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేశారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టుల భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు విస్తరింపజేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం పెంపులో తెలంగాణ ప్రాంతం తెలుగుదేశం, టీఆర్ఎస్, కోస్తా ప్రాంతం టీడీపీ నాయకులు సంయుక్తంగా జతకట్టి ఆరోపణలు గుప్పించారు. జలయజ్ఞం ప్రాజెక్టుల నిర్మాణపు పనులు దృష్టిలో ఉంచుకొని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఆరోపణలు గుప్పించిన నాయకుల అందరి నోర్లు మూయించి, ఒప్పించి, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ విస్తరణ సామర్థ్యం పెంచారని చరిత్రకారులు వివరిస్తున్నారు. జీఎన్ఎస్ఎస్ పథకంలో తొలుత గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం లేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పులివెందుల నియోజకవర్గానికి తాగు, సాగునీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఆ పథకానికి రూపకల్పన చేశారు. పైడిపాలెం వద్ద 6 టీఎంసీల సామర్థ్యంతో రూ.727 కోట్లు అంచనా వ్యయంతో పైడిపాళెం రిజర్వాయర్ ఏర్పాటు చేశారు. తద్వారా తొండూరు, సింహాద్రిపురం, కొండాపురం మండలాల్లోని చెరువులను నింపి 47,500 ఎకరాలకు కొత్తగా సాగునీరుతో పాటు, పీబీసీ కింద 41,000 ఎకరాలు ఆయకట్టు స్థిరీకరణతో పలు గ్రామాలకు తాగునీరు అందించాలనే సంకల్పం పుచ్చుకున్నారు.

వైఎస్ కుటుంబం కృషి ఫలితమే..

తుంగభద్ర హైలెవెల్ కెనాల్‌లో అంతర్భాగంగా గతంలో పులివెందుల బ్రాంచ్‌కెనాల్ నిర్మించారు. టీబీ డ్యాంలో పూడిక పేరుకుపోవడం, ఎగువప్రాంతాల నీటి అక్రమ వినియోగం వంటి కారణాల వల్ల పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు ఏనాడు పూర్తి సామర్థ్యంతో సాగునీరు అందలేదు. రైతులు అనేక ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆయకట్టు స్థిరీకరణ కోసం చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. అయినా ఆశించిన ఫలితం కన్పించలేదు. ఈ నేపథ్యంలో సీబీఆర్‌కు గండికోట నుంచి 8.3 టీఎంసీల నీటిని 5 లిఫ్టుల ద్వారా తీసుకెళ్లే బృహత్తర పథకానికి కూడా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. రూ.1343 కోట్లు అంచనా వ్యయంతో చేపట్టగా, అందులో రూ.1090కోట్లు దివంగత సీఎం వైఎస్సార్ ఖర్చు చేశారు. నాటి కృషి ఫలితమే నేడు అంబకపల్లెకు కృష్ణా జలాలు వచ్చి చేరాయి. పాడా నిధుల ద్వారా అంబకపల్లె గంగమ్మ కుంటకు రూ.1.4 కోట్లతో 14 ఎకరాల భూసేకరణ చేపట్టి కొత్త చెరువును నిర్మించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎంపీ నిధులతో రూ.2.50 కోట్లు వెచ్చించి హిరోజీపురం గ్రామం వద్ద భారీ సంప్‌ను ఏర్పాటు చేసి 4.5 కి.మీ మేర అంబకపల్లె చెరువుకు పైపులైన్ ఏర్పాటు చేశారు. ఫలితంగా అంబకపల్లె చెరువుకు కృష్ణా నీరు వచ్చి చేరింది. మంగళవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబకపల్లె చెరువు వద్ద జలహారతి ఇవ్వనున్నారు.

చెరువు వద్ద జలహారతుల ఏర్పాట్ల పరిశీలన



గంగమ్మ కుంట చెరువుకు వెళ్లే దారి వెంట ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాలు

లింగాల : లింగాల మండలం అంబపల్లె గ్రామంలో మంగళవారం మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్నారు. సుమారు రూ.4.50 కోట్ల వ్యయంతో చెరువు నిర్మాణం, పైపులైన్, ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి కృష్ణా జలాలను గంగమ్మ కుంట చెరువుకు పంపింగ్ చేయడం జరిగింది. ఈ నీటికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జల హారతులు ఇవ్వనున్నారు. ఇందుకోసం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంగల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డిలతోపాటు తదితర నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పులివెందుల – ముదిగుబ్బ ప్రధాన రహదారి నుంచి గంగమ్మ కుంట చెరువు వద్దకు వెళ్లి రహదారి ఏర్పాటు, చెరువులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జలహారతి ఇచ్చేందుకు తగిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు అంబకపల్లె గ్రామంలోని చెరువు వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జలహారతులు ఇచ్చిన తర్వాత గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులతో చర్చించనున్నారు. గ్రామ సమస్యలు, వాటి నివారణ, తదితర అంశాలపై ఆయన చర్చించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఆయన వెంట తరలివచ్చే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు భోజన వసతి ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. అదేవిధంగా పులివెందుల – ముదిగుబ్బ ప్రధాన రహదారి వెంట ఫ్లెక్సీలు, వైఎస్సార్‌సీపీ జెండాలను ఏర్పాటు చేస్తున్నారు.










అధికారుల రాక ఆలస్యంతో ఆందోళన

వేంపల్లె : వేంపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల రాక ఆలస్యంతో క్రయ, విక్రయదారులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సబ్ రిజిస్ట్రార్ శ్యామలాదేవి, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్య విధులకు ఆలస్యంగా రావడంతో.. అప్పటి వరకు రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అధికారుల తీరుపై మండిపడ్డారు. రోజూ ఇలాగే విధుల నిర్వహణలో సమయం పాటించకపోవడంతో.. రిజిస్ట్రేషన్ కోసం తిప్పలు పడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దళారుల హవా నడుస్తోందని ఆరోపించారు. ఈ విషయమై రిజిస్ట్రార్ శ్యామలాదేవిని వివరణ కోరగా.. సీఎం ప్రోగ్రాం రాజంపేటలోని ములక్కాయపల్లెలో ఉన్నందువల్ల, అక్కడికి వెళ్లి వచ్చే సరికి ఆలస్యమైందని, ప్రతి రోజు సమయపాలన పాటిస్తున్నామని, ఈ రోజు మాత్రమే ఆలస్యమైందని తెలిపారు.

వ్యక్తిపై దాడి.. తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం పాత మార్కెట్‌లో కృష్ణయ్య యాదవ్ అనే వ్యక్తిపై నాగరాజు అనే వ్యక్తి దాడి చేశాడు. ఈ దాడిలో కృష్ణయ్య యాదవ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం బోనాల గ్రామానికి చెందిన కృష్ణయ్య యాదవ్ పని నిమిత్తం పులివెందులకు వచ్చాడు. పులివెందుల పట్టణం నగరిగుట్టలో నివాసముంటున్న నాగరాజు అనే వ్యక్తిని గతంలో బొలెరో వాహనంతో ఢీకొట్టడంతో అప్పట్లో నాగరాజుకు కా లు విరిగింది. ఇది మనసులో పెట్టుకొని సోమ వారం మధ్యాహ్నం పాత మార్కెట్‌లోని కాంప్లెక్స్‌లో ఉన్న కృష్ణయ్య యాదవ్‌పై నాగరాజు దా డి చేశాడు. దీంతో కృష్ణయ్య యాదవ్‌కు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణునారాయణ తెలిపారు.

సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అసత్యాలు పలికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చింది. సూపర్ సిక్స్ పథకాల్లో ఎంత వరకు అమలు చేశారో ప్రజలకు బాగా తెలుసు. కూటమి ప్రభుత్వం నాయకులు సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అంటూ డబ్బాలు కొట్టుకోవడం పరిపాటిగా మారింది' అని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోనికి వచ్చిన ఎన్‌డీఏ కూటమి ఏదీ కూడా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటిని అమలు చేయలేమని చేతులు ఎత్తేస్తే, మరో మంత్రి ఈ పథకాలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాలంటూ ప్రకటించడం దారుణం అన్నారు. ఇచ్చిన హామీలు అమలు పరచలేక సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశామని ర్యాలీలు చేసుకోవడం, పథకాలు అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని తెలిపారు.

అసలు ఆదినారాయణరెడ్డి ఎవరు!

'ఆదినారాయణరెడ్డి ఎవరు. బీజేపీ టిక్కెట్ ఇస్తే ఆ టిక్కెటు మీద గెలిచి ఎమ్మెల్యేవు అయ్యావు. నీకు పార్టీ టిక్కెట్ ఇచ్చిన వ్యక్తి బీజేపీ చీఫ్ నడ్డా. అలాంటి వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫోన్ చేసి ఎన్‌డీఏ కూటమి తరపున నుంచి నిలబడ్డ ఉప రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతూ ఇవ్వాలంటూ కోరారని, దానికి అనుగుణంగా ఎంపీలతో చర్చించి నిర్ణయం తీసుకుని చెబుతామని ప్రకటించి ఆ తర్వాత ఎన్‌డీఏ కూటమి అభ్యర్థికి మద్దతూ ఇస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ప్రకటించింది' అని రామ సుబ్బారెడ్డి అన్నారు. 'అయితే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వీరి మద్దతూ తమకు అవసరమేలేదంటూ పలుకుతున్నారు. ఆ మాట మీ ఉన్నత నాయకులతో చెప్పిస్తే బాగుంటుంది. నీ స్థాయి ఏమిటో నీకే అర్థం అవుతుంది. పార్టీలో నీ స్థాయి తెలుసుకుని మాట్లాడితే బాగుంటుంది' అని ఎమ్మెల్సీ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర కార్యదర్శి లక్షుమయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




జలయజ్ఞ ప్రధాతకు ఘననివాళి (వర్ధంతి)
2019-2024లో జగనన్న ప్రభుత్వంలో రూ. 250 కోట్లు
ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించి చిత్రావతి రిజర్వాయర్ కెపాసిటీ 5 టీఎంసీల నుంచి
10 టీఎంసీలకు పెంచారు. అదేవిధంగా కోట్లాది రూపాయాలు వెచ్చించి లింగాల మండలంలో
అన్నీ గ్రామాల చెరువులకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందించారు.
మీ హయాంలో నిర్మించిన "అంబకపల్లె గంగమ్మ కుంట" కు రూ. 2.5 కోట్లుతో ఎత్తిపోతల పథకం పూర్తి చేసి
నీరు అందించి, మా గ్రామాన్ని, మా మండలాన్ని, సస్యశ్యామలం చేసిన మా ప్రియతమ నాయకుడు
శ్రీ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గారికి
మా హృదయపూర్వక ధన్యవాదములు...
ఇట్లు...
అంబకపల్లె గ్రామ ప్రజలు
మరియు లింగాల మండల ప్రజలు